# పరాజిత

దాదాపు అయిదు సంవత్సరాల తరువాత, అదే సూట్ కేసుతో ఆ గడప లోపలికి కాలు పెడుతూ వుంటే కాళ్ళు గజగజా వొణికాయి. గుండె దడదడా రెట్టింపు వేగంతో కొట్టుకుంది. అక్కడి ప్రతీ గది, ప్రతీ చోటు తనకి దాదాపు మూడు సంవత్సరాల వరకూ ఎంతో పరిచయమే. ఎన్నో ఊసులు. ఎన్నెన్నో జ్ఞాపకాలు. ఏవేవో మధురానుభూతులు. ఆ ఇల్లు ఒకప్పుడు తనకి దేవాలయం. అందులోని మూర్తి తన హృదయేశ్వరుడు. తన జీవితాన్ని పంచుకున్నవాడు. ప్రేమవాహినిలో ముంచెత్తి జీవితంలోని మకరందాన్ని చవి చూపించినవాడు. అగ్నిసాక్షిగా పెళ్ళాడినవాడు. తన భర్త నవీన్.

తియ్యని తలపులతో మది పులకించగా పెదవులు చిరునవ్వు చిన్నగా చుంబించింది! అది ఒక్క క్షణం మాత్రమే!

చందమామని నల్లమబ్బులు కప్పేసినట్టు విషాదం ముఖాన్ని ముకుళింపజేసింది. సందేహం, భయం ఒక్కసారిగా పోటీపడి భయపెడుతుంటే లోపలికి వెయ్యబోయిన కాలుని వెనక్కి తీసుకుంది చంద్రలేఖ.

"ఛస్తే మళ్ళీ ఈ గడపలో కాలు పెట్టను! మీ మొహం చూడను. గుడ్ బై!...." అంటూ విసురుగా సూట్ కేసు పుచ్చుకుని తిరిగి చూడకుండా వెళ్ళిన సంఘటన గుర్తుకొచ్చింది. సరిగ్గా అయిదు సంవత్సరాల తరువాత తిరిగి ఆ గడప తొక్కాలంటే కొత్తగా అనిపించింది. బెరుకుగా అనిపించింది. ధైర్యం చేసి ఎలాగో గడియ వెయ్యకుండా దగ్గరగా వేసివున్న తలుపు తీసుకుని లోపలికి వెళ్ళింది.

హాల్లో నవీన్ కూర్చున్నాడు. చేతిలో ఏదో పుస్తకం వుంది. నవీన్‌కి ఇంగ్లీష్ ఫిక్షన్ ఎంతో ఇష్టం. అక్కడి చరిత్రకి, నాగరికతకి, ఇంగ్లీష్ నవలలు అద్దం పడతాయని అతని నమ్మకం. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయేముందు

తప్పనిసరిగా కాస్సేపు ఏదో ఒక పుస్తకం చదివేవాడు. ఆదివారాల్లో, ఇంటి దగ్గర తీరిక సమయాల్లో పుస్తకం అతడికి అప్తుడూ, నిజమైన స్నేహితుడూ. ఒకసారి తమ పెళ్ళయిన కొత్తలో అతనికి ఆలూ పరోఠాలు ఇష్టమని తెలుసుకుని, తన పంజాబీ ఫ్రెండు మిసెస్ ఖత్రీని కలిసి అవి ఎలాచెయ్యాలో తెలుసుకుని అప్పటికప్పుడు కూర్చుని చేసి, డిన్నర్ టైములో అతనికి సర్‌ప్రైజు ఇవ్వాలని చేస్తే, ఏదో నవల చదువుతూ తనేం తింటున్నాడో కూడా తెలుసుకోలేనంతగా ఆ నవలలో లీనమైపోతే, తనకి ఏడుపొచ్చి ఒళ్ళు మండిపోయి అతని చేతిలోంచి ఆ పుస్తకాన్ని లాగిపారేసినపుడు నమిలి ముద్ద మింగుతుంటే గొంతు పిసికినంత కోపం వొచ్చినా "చందూ! ఎందుకిలా చేస్తావ్? ప్లీజ్, పుస్తకం ఇవ్వు" అనగానే రెట్టింపు రోషంతో "ఏం తింటున్నారో కూడా తెలుసుకోలేనంత ఇంట్రెస్టింగ్‌గా ఏముందండీ ఆ పుస్తకంలో?" అంది తను. వెంటనే పళ్ళెం కేసి చూసి సంతోషంతో "ఓ....ఆలూపరోఠా! మరొకటి వెయ్" అంటూ మెచ్చుకుంటూ తిన్న విషయం గుర్తుకొచ్చి మనసు తబ్బిబ్బైంది. తన కోసం ఆ రాత్రి అతను పుస్తకాన్ని మరి ముట్టుకోలేదు. తలుచుకోగానే సిగ్గుతో శిరోభారం పెరిగినట్టయింది. తల కిందికి వంగింది. క్రీగంట అతని కేసి చూచింది. అప్పుడే స్నానం చేసొచ్చినట్టున్నాడు. తెల్లని మల్లుపంచె. బనీను వేసుకోలేదు. తువ్వాలు భుజంమీద వేసుకున్నాడు. తెల్లని వక్షస్థలంమీద తను తలపెట్టుకుని గోముగా గుసగుసలు చెప్పేది దట్టంగావున్న వెంట్రుకలూ, బాగా నూనెరాసి నున్నగా దువ్వుకున్న క్రాపు అతని రూపం, ఆరోగ్యం అయిదేళ్ళ క్రితం తను వెళ్ళిపోతున్నప్పుడు ఎలా వున్నాయో ఇప్పుడూ అలాగే అనిపించింది. తృప్తిగా నిట్టూర్చింది. కానీ మరుక్షణంలోనే ఒకరకమైన అహం ఆమెని కొరడాతో కొట్టినట్లనిపించింది. తన ఆత్మని చూసి నవ్వుతున్నట్టనిపించింది.

"పిచ్చిదానా! నువ్వు లేనంత మాత్రాన, అతడు నీ కోసం బెంగ పెట్టుకుపోయి, నిన్ను తలచుకుని పిచ్చివాడై పోయి, దేవదాసులా తాగుతూ చంద్రా చంద్రా అని రోడ్లంట తిరుగుతూ, చిక్కి శుష్కించి పోతాడనుకున్నావా? హీ....ఈజ్....ఎ....మాన్!....అతడు మొగాడు! ఎక్కడైనా తింటాడు, ఏమైనా తింటాడు, హాయిగా వుంటాడు! ఇది జీవితం! నవలో సినిమానో కాదు" అంటూ హేళన చేస్తున్నట్టనిపించింది. ఎదురుగుండా వున్న అద్దాల బీరువామీద తన ప్రతిబింబం కనిపించింది. నల్లబడ్డ శరీరం, పీక్కుపోయిన మొహం, పాలిపోయిన కళ్ళూ తనని వెక్కిరిస్తూన్నట్టున్నాయి. తను ఇంట్లోంచి కాలు బయట పెడుతూన్న రోజున వుండే శరీరచ్ఛాయ, ఆ నిగారింపూ, పాము బుసలు

కొడుతున్నట్టుగా కోపంతో తను ప్రదర్శించిన ఆ దర్పం అంతా ఏమైపోయాయి? వొదినగారి శుశ్రూషలో, అన్నయ్యగారి ఆప్యాయతలో అంతరించిపోయాయా? అదృశ్యమైపోయాయా? అందుకేనేమో చెడి పుట్టింటికి పోకూడదంటారు.

ఈ విశాల వక్షస్థలంమీద లక్ష్మీదేవి కూర్చున్నట్టు తల అనించి, సుతారంగా అతని క్రాపులోనికి వేళ్ళు పోనిచ్చి చిలిపి కబుర్లు చెప్పకునే తన తలా, చేతులూ, నోరూ....ఒదినగారి పరాభవాల ముందు తల వంగిపోయింది. ఇంటెడు చాకిరితోటి చేతులూ, వేళ్ళూ మొరటుబారిపోయాయి. నోరు షాక్‌తోటి మూత బడిపోయింది. "నా అన్నగారు, నా ఒదినగారు" అని ధీమాగా వెళ్ళిన తనకి "నా" అనేది చెప్పకోవడానికి ఏమీ మిగలకుండా తగినశాస్తి జరిగింది. ఛీ ఒదిన అడదేనా అసలు? తమ్ముడు తప్పతాగి నా గదిలోకొచ్చి నా వొంటిమీద పడితే భయంగా అరచిన నన్ను చూసి, నన్ను సమర్థించకుండా, మొగుడొదిలేసిన దాన్నని సిగ్గయినాలేకుండా సింగారించుకుని వాణ్ణి నీవైపుకి లాక్కోవాలని చూస్తున్నావా? అని నానా మాటలు అంది. గుండెలో సూదులు గుచ్చుకున్నంత బాధతో తను "అన్నయ్యా" అని రోదిస్తూ దగ్గరికెళితే "ఛీ - నీ ముఖం నాకు చూపించకు" అని చీదరించుకుని వెళ్ళిపోవడం చూస్తే వాళ్ళని నరికిపోగులు పొయ్యాలన్నంత కోపంవొచ్చింది. అంతలోనే తనలో దాగివున్న లోపలిమనిషి పకపకా నవ్వుతూ "అర్థమయిందా చంద్రీ? ఈ బాధ ఆ రోజు నువ్వు చేసిన పనేమిటి? నవీన్ క్లాస్‌మేట్ కాదంబరి, నవీన్ సహాయం వలననే పిహెచ్.డి. వొచ్చిందని తెలిసి సంతోషం పట్టలేక స్వీట్స్ తెచ్చి, అతను వద్దంటున్నా వినక అతని నోట్లో పెట్టినందుకు నువ్వు విరుకుపడ్డావ్. తల్లీతండ్రి లేని ఆ బీదపిల్లని చదివించినందుకు నానామాటలు అని, లేనిపోని అక్రమ సంబంధాన్ని అంటగట్టి, బతిమాలుతున్నా వినక ఉన్న పళాన బయలుదేరిపోయావు. నీకూ వీళ్ళకి ఏమిటి తేడా?" నిలదీసి అడిగింది. సమాధానం దొరకని చంద్రిూ తత్తర పాటుతో బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూసింది.

అంతలోనే నవీన్ తలెత్తిచూశాడు. ఆశ్చర్యంతో ముడిపడ్డ కనుబొమలు విడదీసి చిరునవ్వుతో చెయ్యిసాచి ఆహ్వానించాడు.

ఆ ఆహ్వానానికి ఆమె నవనాడులూ స్పందించి మెలికలు తిరిపోయాయి.

కళ్ళు భూమిమీద ఆనక తేలిపోతున్నట్టనిపించింది. గుండె వేగం పదింతలయింది.

పసిపాపలా పరుగెత్తి అతడి ఒడిలో కూర్చుని వక్షస్థలం మీద తల ఆనించి తనివితీరా ఏడవాలనిపించింది. ఈ అయిదేళ్ళలో తను అనుభవించిన నరకయాతనంతా పూసగుచ్చినట్టు అతనికి వినిపించాలనిపించింది. కానీ ఏదో నిస్సహాయత! ఏదో బలహీనత! మెల్లగ అడుగులో అడుగు వేస్తూ, అతని చేతిని తాకింది. ఆ వెచ్చదనానికి ఆమె గుండెలో నిండుకున్న బాధ కరిగి ప్రవహించి కన్నీరై కారింది.

"కూర్చో!" అన్నాడు నవీన్.

ఆమె కూర్చుంది.

"మరి తిరిగి రావనుకున్నాను. ఎందుకంటే, నీ పట్టుదల నాకు తెలుసు గనుక!"

ఆమె మాట్లాడ లేదు.

"చంద్రీ! నువ్వు లేకపోయినా నేను ఇంత ఆరోగ్యంగా, హాయిగా ఎలా వుండగలిగానని అనుకుంటున్నావు కదూ?" చంద్రలేఖ అతని కళ్ళల్లోకి చూసింది.

నవీన్ చంద్రూనే చూస్తున్నాడు.

"చంద్రీ! నువ్వు ఈ ఇంట్లోంచి 'నా అన్నయ్య దగ్గరకి వెళ్ళి పోతున్నాను' అని దీమాగా వెళ్ళిపోయావు, కానీ, నేను ఎక్కడికీ వెళ్ళలేక, నువ్వు లేని ఇంట్లో నేను ఒంటరిగా వుండలేక, నీ పట్టుదలా మనస్తత్వం తెలిసిన నేను, నువ్వు మరి తిరిగిరావని తెలిసి ఎంతగా నాలో నేనే కుమిలి కుమిలి యేడ్చానో, నీకు చెప్పడానికి మాటలు చాలవు. చంద్రీ! ప్రతీ పనీ నువ్వే చేసిపెట్టి, నాకుగా నేను కాఫీ కూడా కలుపుకోవడం చేతకాని అసమర్థుడిగా చేశావు. నీ సాహచర్యంలో, నీ అభిమాన ధుని స్వర్గ సుఖాలు రుచి చూసిన నేను నీవు లేకుండా క్షణమైనా జీవించలేనని తెలుసుకునేసరికే పిచ్చివాణ్ణయిపోయాను. 'చంద్రీ! చంద్రీ!' అంటూ కలవరిస్తూ జ్వరంతో వారం రోజులు వీధి ముఖం చూళ్ళేదు. ఒక రోజు పాలు తీసుకోబోయి తూలిపడిన నన్ను చూసి పాలవాడూ పనిమనిషీ కలిసి, కాదంబరిని పిల్చుకొచ్చారు. నన్నాస్థితిలో చూసిన కాదంబరి, నా ఈ పరిస్థితికి తనే కారకురాలినని తెలిసి పశ్చాత్తాపంతో కుంగిపోయి పరిహారంగా, తనిక్కడే వుండిపోయి పరిచర్యలు చెయ్యడం

మొదలెట్టింది. దాదాపు వారం రోజులు పట్టింది నాకు జ్వరం తగ్గి నార్మల్ రావడానికి. ఆ వారం రోజులూ కాదంబరి రాత్రింబవళ్లూ టైము ప్రకారం మందులు వేస్తూ నా దగ్గరే వుంది. నేను కొంచెం లేచి తిరగడం మొదలెట్టాక, ఆమె యూనివర్శిటీ పనిమీద వెళ్ళిపోయింది నేనూ ఆ రోజే వీధిమొహం చూశాను. అంతవరకూ కాలేజీకి లీవు చీటికూడా పంపలేదు. ఆ రోజు కాలేజీలో అడుగుపెట్టిన నన్ను అందరూ అదోలా చూశారు 'నవీన్! నీ భార్య వొదిలేసిందట?' అని ఒకరూ. 'ఎందుకనో?' అని వ్యంగ్యంగా కొందరూ 'నపుంసకుడా' అని మరి కొందరూ నాకు వినపడేలాగే గుసగుసలు చెప్పుకోవడం భరించలేకపోయాను.

"అదేదీ కాదు, నవీన్ కాదంబరి మోజులో పడ్డాట్ట!"

"అవును. భార్య వెళ్ళిపోతే ఇదే బాగుందనుకుని కాదంబరిని ఏకంగా ఇంట్లోనే పెట్టుకున్నాట్ట!" అంటూ స్టూడెంట్ల దగ్గరినుంచి నా కొలీగ్స్‌వరకూ మాట్లాడే మాటలు నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. కాలేజీకి రిజైన్ చేస్తూ మర్నాడు ఉత్తరం పంపించాను. ఆ రోజంతా మతి భ్రమించినట్టు ఊరంతా తిరిగి తిరిగి అర్ధరాత్రి ఇల్లు చేరుకున్న నేను తాళం చెవి నా దగ్గరే ఉండడం వల్ల లోపలికి పోలేని కాదంబరి వరండాలో ఒక మూల ముడుకుని కూర్చోవడం చూసి నా కోసం ఎందుక్కూర్చున్నావ్? నా పేరు ఇంకా బురదలోకి తొయ్యాలనా? అంటూ వొళ్ళుతెలీని కోపంతో నానా మాటలు అనడమే కాకుండా నా చంద్రిని నేను మర్చిపోయి నీతో వుంటాననే అనుకున్నావా? అంటూ పిచ్చి కోపంతో చెళ్లున కొట్టాను. కళ్ళు తిరిగాయేమో కాదంబరి తూలిపోతూ గబుక్కున నా చేతిలోని తాళంచెవి తీసుకుని తాళంతీసి లోపలికెళ్ళి తన బట్టలున్న సూటుకేసూ, తన సర్టిఫికేట్లూ తీసుకుని "తోటిస్త్రీకి ద్రోహం చేసే గుణ హీనురాల్ని కాను నేను. నాకు సహాయం చేసిన మనిషికి ప్రత్యుపకారంగా సహకరించేందుకు వున్నానిక్కడ. ఆ నిస్సహాయ స్థితిలో మిమ్మల్ని ఒదిలి వెళ్ళడం మానవత్వం కాదు గనుక, అన్ని నిందలూ భరించి ఇక్కడ వున్నాను. అంతేకానీ, చంద్రలేఖగారి స్థానాన్ని కోరిమాత్రం కాదు," అంటూ విసురుగా ఆ చీకట్లో కలిసిపోయింది. ఒకపక్క నీమీది ప్రేమ, మరోవక్క ఆమె పైన వున్న వాత్సల్యం, కృతజ్ఞత నన్ను మరీ పిచ్చివాణ్ని చేశాయి.

నువ్వు రావని తెలుసు.

కాదంబరి వొస్తుందేమోనని ఏదో ఆశ! రోజులు గడుస్తున్నాయి.

ఒంటరితనం జీవితాన్ని భయపెడుతోంది. పెరిగిన గడ్డం, మాసిన బట్టలు నామీద నాకే అసహ్యం పుట్టింది, నన్ను నేను మర్చిపోవాలనుకున్నాను. దేనినైతే ద్వేషించానో, "విరహాన్ని భరించలేక బాధన్ని మరచిపోవడానికి తాగాడు దేవదాసు" అన్నప్పుడు ఆ పాత్రనీ ఆ రచయిత శరత్‌ని ఎంతగా హేళనచేసి నవ్వానో అంతా మర్చిపోయి, నేను తాగుడు మొదలెట్టాను. పీకల వరకూ, నన్ను నేను మర్చిపోయే వరకూ తాగిన నేను ఒక రోజున నడిరోడ్డున పడివుంటే నా ఫ్రెండు సత్యం తీసుకొచ్చి గదిలో పడుకోబెట్టాట్ట! చంద్రీ, కాదంబరీ అని కలవరిస్తున్న నన్ను చూసి చంద్రి వెళ్ళిపోయిన సంగతి తెలుసు గనుక కాదంబరి ఎవరో తెలుసుకుని ఆమెకి విషయాన్నంతా చెప్పి వొప్పించి నా దగ్గరకి తీసుకునొచ్చాడు.

కాదంబరి ఆమె వాత్సల్యంతో నా చేత తాగుడు మానిపించింది. నాచేత బలవంతంగా ఒక ప్రైవేటు కాలేజీకి అప్లై చేయించి ఉద్యోగానికి వెళ్లేలాచేసింది.

స్వంత లాభం కొంత కూడా ఆమెలో లేదు!

అయినప్పటికీ ఆమెని నలుగురూ నానా మాటలూ అన్నారు. ఆమె స్నేహితులే ఆమెని వెలేశారు. 'కులట' అని, వుంచుకున్నదనీ యేవేవో కూశారు. అయినా ఆమె కిక్కురు మనలేదు.

ఒకరోజు ఆమె యూనివర్సిటీకి వెళ్ళేసరికి గోడలనిండా వెధవరాతలు రాసున్నాయి. "కాదంబరి ఫర్ సేల్" అని, "కాదంబరి కేరాఫ్ నవీన్" అని "నవీన్ కేరాఫ్ కాదంబరి" అని యేవేవో రాశారు. అది భరించలేని కాదంబరి ఇంటికొచ్చి, కిరసనాయిల్ పోసుకుంది. వొంటిమీద నిప్పంటించుకునే సమయానికి కళ్ళజోడు మర్చిపోయి ఇంటికొచ్చిన నేను, ఆ ఘోర కృత్యం నుంచి ఆమెనాపగలిగాను.

"వద్దు నన్నాపొద్దు. నువ్వు బతికించినా సమాజం నన్ను చంపేస్తుంది చిత్రహింసలు పెట్టి. నేనూ, నువ్వూ కలిసి గొంతుచించుకుని అరిచినా మేము పవిత్రంగానే బతుకుతున్నామని, మన మాటలు ఎవ్వరూ నమ్మరు. నన్ను చావనీ" అంటూ పిచ్చిగా అరిచి అగ్గిపుల్ల గీస్తున్న కాదంబరిని చెళ్లున కొట్టి అగ్గిపెట్టిలాగి అవతల పారేసాను. సరిగ్గా అదే సమయానికి నాకోసం ఎందుకు

కాలేజీకి రాలేదో కనుక్కోడానికి వచ్చిన సత్యం ఈ దృశ్యం చూసి కంట తడి పెట్టి "ఒరేయ్! చంద్రలేఖగారు పట్టుదలగల మనిషి ఆమె రారు. కాదంబరి నిన్ను కళ్ళలో పెట్టుకుని, అన్ని నిందలూమోస్తూ నీకోసం బతుకుతోంది. ఆమెను నా సోదరిగా భావించి మీ ఇద్దరికీ నేను పెళ్ళి జరిపిస్తాను" అన్నాడు. "నో. నా చంద్రి ఈ వార్తతెలిస్తే భరించలేదు. ఆమెకి నేనంటే ప్రాణం. ఏదో పంతానికి పోయి అలా అందే తప్ప నాకు తెలుసు ఆమె మనసు" అన్నాను.

"యూ ఆర్ ఎ ఫూల్, ఇప్పటికి తొంభై ఉత్తరాలు రాశావు. ఒక్కదానికైనా సమాధానం రాసిందా? వెళ్ళి అయిదేళ్ళు కావస్తోంది. నువ్వు బతికావో చచ్చావో తెలుసుకుందా? ఏదిరా ప్రేమంటే? నీ కోసం నానా నిందలూ మోస్తూ తాను కాలిపోతూ నీకు వెలుగు నిస్తున్న ఈ కాదంబరిదా? అహం భావంతో నిన్ను ఏకాకిగా వొదిలేసి తన ప్రేమకి నిన్ను బానిసగా వాడుకోవాలనుకున్న ఆ చంద్రలేఖదా?" అనడిగాడు.

కాదంబరి దీనంగా నా కళ్ళలోకి చూస్తోంది.

నా హృదయం ద్రవించి పోయింది.

ఆ సౌజన్యమూర్తి ప్రేమతో నా మనసంతా నిండిపోయింది.

"కాదంబరి" అంటూ కౌగిలించుకోబోయాను.

"నవీన్! నాకు కావలిసింది నామీద జాలికాదు. నాకు తెలుసు నీ మనసులో నాకు స్థానంలేదని" అంది దూరం జరుగుతూ.

"కాదంబరీ! ఈ మాట ఒకప్పుడు నిజం. కానీ ఇప్పుడు నిస్వార్థమైన ప్రేమతో, నీ పవిత్రమైన సేవలతో నన్ను 'నీవాణ్ణి జేసుకున్నావు. ఇప్పుడు నా మనస్సులో నువ్వుతప్ప మరెవ్వరూ లేరు" అన్నాను.

కాదంబరి అదోలా చూసింది. ఆ చూపులు ఒకవేళ చంద్రలేఖ తిరిగొస్తే? అన్నట్టున్నాయి. ఏ స్త్రీ మాత్రం తన ప్రేమని మరో స్త్రీతో పంచుకోవడానికి సిద్ధంగా వుంటుంది? స్త్రీయేకాదు పురుషుడు మాత్రం అంతేకదా! ఒకరినొకరు మనస్ఫూర్తిగా కోరుకున్నవారు త్యాగానికైనా సిద్ధపడతారు గానీ, సర్దుకోవడానికి సిద్ధమౌతారా?

"కాదంబరీ! చంద్రలేఖ తిరిగొచ్చినా సరే, లోకం నన్ను తరిమికొట్టినా సరే, నేను ఎప్పుడూ నీ వాణ్ణే. నీకే సొంతం. ప్రామిస్" అంటూ ఆమె చేతిలో

చెయ్యి వేశాను. ఆ స్పర్శకి ఇద్దరిలో నిద్రాణమైవున్న యవ్వనపు పొంగు ఒక్కసారిగా పెల్లుబికింది. కొత్త అనుభూతులు, కొత్త కోరికలు - నరాలు తెగిపోతున్నట్టపించింది.

ఆ తరువాత సత్యం మా పెళ్ళి గుళ్ళో నింపులుగా జరిపించాడు. అప్పటినుంచి ఇప్పటివరకు కాదంబరి నన్ను కళ్ళల్లో పెట్టుకుని చూస్తుంది మాకో బాబు, పాపా పుట్టారు. మా ముగ్గురి సంరక్షణకోసం తాను ఉద్యోగం మానేసింది. తన పంచప్రాణాలూ మామీదే. ఆ ఇద్దరి పిల్లలతోపాటు నన్నూ ఒక పిల్లవాణ్ణిగానే చూస్తుంది కాదంబరి. ఆమెలో అమ్మనీ, ఆమెలో ప్రియురాలినీ, ఆమెలో స్నేహితునీ, ఆమెలో కార్యశూర్యతనీ అన్నీ సమపాళ్ళలో మిళితమై వుండడం చూశాను. ఆమె పరిపూర్ణమైన స్త్రీకి మారు పేరు అంటే అతిశయోక్తి కాదు." అన్నాడు చంద్రు కళ్ళలోకి చూస్తూ.

ఆమె కళ్ళు నీటి కుండలయ్యాయి. ఆమె వదనం సూర్యరశ్మి సోకిన కమలంలా ముకుళించుకుపోయింది.

ఆమెలోని అంతర్మనిషి ఇలా అంది: "చంద్రూ!నువ్వు నవీన్‌ను గాఢంగా ప్రేమించావు. కానీ, నీ అహంభావంతో, అజ్ఞానంతో అతడూ నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడని తెలిసినా, అతణ్ణి నీ చుట్టూ తిప్పుకోవాలనీ, ఆజ్ఞాపించి అదుపులో పెట్టుకోవాలని చూశావు అక్కడే దెబ్బతిన్నావు.

కాదంబరీ అతణ్ణి నీ అంత గాఢంగానూ ప్రేమించింది. నీ రూపాన్ని మదిలోంచి తుడిపేశాక అతడూ ఆమెని అంత గాఢంగానూ ప్రేమించాడు. అది తెలుసుకున్న కాదంబరి అతనికి తనని తాను అర్పించుకుంది. అతనిని దేనికీ ఆజ్ఞాపించలేదు. బంధించలేదు. తను గీసుకున్న చట్రంలో ఇమడ్చడానికి ప్రయత్నించలేదు. అతనికి సంపూర్ణమైన స్వేచ్ఛనిస్తూ తన అభిమానంతో తన వైపుకి తిప్పుకుంది" అంది

"ఈ రోజు మా మున్నీ అదే మా నివేదిత పుట్టినరోజు కాదంబరి గుడికి వెళ్ళింది. వచ్చేస్తుంది" అన్నాడు నవీన్.

ఒకప్పుడు 'నాది' అని విర్రవీగిన తన ఇంట్లో తను అతిథిగా వుండడం భరించలేకపోయింది.

"నవీన్! నీ సుఖసంసారంలో నా ఛాయలు పడకూడదు. నేనొస్తా!" అంటూ లేచింది చంద్రలేఖ.

నవీన్ మోహం అదోలా మారిపోయింది.

"ఎక్కడికి పోతావ్" అడిగాడు నవీన్.

"తెలీదు"

"మరి?"

"కాళ్ళు తీసుకుపోయిన చోటికి" అంటూ కళ్ళు తుడుచుకుంటూ సూటు కేసు పుచ్చుకుని గబగబా వెళ్ళిపోయింది. తిరిగి అయిదేళ్ళనాడు వెళ్ళిన స్పీడులోనే.

నవీన్ పిలుపు "చంద్రీ! చంద్రీ" గాలిలోనే కలిసిపోయింది.

రెప్పపాటులో ఒక కారు రయ్‌మని దూసుకుపోవడం, జనం గుంపు గూడడం జరిగిపోయింది.

తల పగిలి రక్తపుమడుగులో పడుంది చంద్రలేఖ.

గుడినుంచి తిరిగొచ్చిన కాదంబరి కెవ్వుమంది.

తలొకరూ తలొకమాట అంటున్నారు.

"ఊరకేపోతుందా? ఆ రోజు ఇట్టాగే పెట్టె పుచ్చుకుని ఉన్న పళాన ఇల్లొదిలిపోతే ఆ అయ్య పడ్డబాధలూ, ఆ ఉసురు ఊరికేపోతుందా! తగిన శాస్తి జరిగింది" అన్నారెవరో.

చంద్రి భారంగా కళ్ళు తెరిచి చూసింది. అది తన పనిమనిషి మల్లి గొంతు.

"అవునే మల్లి! నాకు తగినశాస్తే జరిగింది." అనుకుంటూ మనసులోనే, దాని మావ పక్కననుంచున్న మల్లిని ఆశీర్వదించుతూ కళ్ళు మూసుకుంది చంద్రలేఖ, మరెన్నటికీ ఆ కళ్ళు విడివడనంత గట్టిగా. *